# ★ అమరుడు ★

రచన: వలయేటి సుందరరామయ్య

రాత్రి రెండు ఘడియలు గడిచింది. అంబి పురిలో ఆలోచనా నిమగ్నుడై వున్నాడు పాంచాల దేశాధీశుడు పురుషోత్తమ చక్రవర్తి రానున్న విపత్తు ఆర్యావర్తనానికే గాదు, యావత్ భారతదేశానికి సంభవిస్తుంది. పాడి పంటల కాలవాలమై, ప్రకృతిశోభకు పట్టుకొమ్మై భాసిల్లు రత్నగర్భను — తన మాతృభూమిని కబళింప కాచుకొని వున్నాడు గ్రీకు దేశాధీశుడైన అలెగ్జాండరు, సర్వసైన్య సమేతుడై జీలంనది ఆవలి వడ్డున.

కయ్యానికి కాలు దువ్వుతూ, ఎదిరించిన రాజ్యాలను కబళిస్తూ, జైత్రయాత్ర జేస్తున్నాడు అలెగ్జాండరు. అతని పదఘట్టనలో ఎన్నో రాజ్యాలు అస్తమించినాయి. సస్యశ్యామలమైన భరతఖండంలో పౌరుష ప్రతాపాలకు కూడ కొరత వుండదని ప్రతీతి. భీకర, ఘోరసంగ్రామంలో తన నెదిరించే ఉజ్జీ భారతవనిలో దొరుకుతాడని అలెగ్జాండరు ఆశ. గ్రీకుసేనావాహిని భారతదేశాని కభిముఖంగా పురోగమించింది.

'తక్షశిల' దేశాధీశుడు 'అంబి' మాతృదేశద్రోహియై గ్రీకులకు దారి యిచ్చుటయే గాక, కానుకలు పురస్కరించుకొని, అలెగ్జాండరు ఆసరాతో ఆర్యవర్తనాన్ని అంతమొందించ తలచాడు.

పౌరుషానికి పుట్టినిల్లు — కడిమియోధుల కదనరంగం భరతఖండం. దౌర్జన్యాలకు దాసోహమంటూ పరదేశీయుల పాదాక్రాంతులెన్నటికీ గారు భారతీయులు. ఆకాశదేవత అనుంగు బిడ్డను, 'ప్రపంచవిజేత'నని ప్రగల్భాలు పలుకుతూ, మారణహోమం జేస్తున్న అలెగ్జాండరు నెదిరించి, తమ శౌర్యప్రతాపాలు చవిజూపింప వువ్విళ్ళూరుతున్నారు భారతవీరులు. వారి రణోత్సాహం, కార్యదీక్ష దేశానికి శ్రీరామ రక్ష.

'జయము మహారాజా! మన సరిహద్దుల నతిగమించి కొన్ని సేనలు పరుగులెత్తి వస్తున్నాయి మిత్రులో, శత్రులో తెలియడంలేదు.' నురుగులు గ్రక్కుతూ వచ్చిన భటుడొకడు విన్నవించాడు.

పురుషోత్తముడు జీలంనది వైపు దృష్టి సారించాడు. గ్రీకులు నిర్మించిన గుడారాలు అలాగే వున్నాయి. కాగడాలు వెలుగుతూనే వున్నాయి. పురుషోత్తముని మనస్సు శంకించింది, మోసము గాదు గదా అని.

'మహారాజా! ఆర్యావర్తనాన అడుగిడిన సేన అన్యులదైతే దైతే అంతమొందించ డానికి ఆప్తులదైతే ఆహ్వానించడానికీ అనతి వేడుచున్నాను.'

ఎవరీ వీరశిఖామణి? పురుషోత్తముడు వెనుదిరిగి చూచాడు.

ఖడ్గ, కవచ, శిరస్త్రాణాలు ధరించి, యుద్ధసన్నద్ధుడై, వీరాభిమన్యుడిలా వున్న అమరుని జూచి, పురుషోత్తముని ఒడలు పులకరించింది. దేశ, కాల పరిస్థితుల నెరిగి, దేశరక్షణకై నడుం బిగించిన అమరునిలాంటి కొమరుని ప్రసాదించినందుకు భారతాంబ కోమారు ప్రణమిల్లాడు.

'కుమార్! వచ్చెడిసేన మన మిత్రులదైతే సగౌరవంగా ఆహ్వానించు. శత్రువులదైతే వీరాభిమన్యునిలా విజృంభించి, నీ తల్లి ఋణం తీర్చుకో' పుత్రుని దీవించి పంపాడు పురుషోత్తముడు.

అమరుడు వీరగీతా లాలాపిస్తూ, తన సేనల నురకలెత్తిస్తున్నాడు. కనుచూపు మేరలో కాగడాల కాంతి కనిపిస్తూంది. కాగడాల కాంతి దగ్గరయే కొలది గ్రీకుల శిరోవేష్టాలు కనిపిస్తున్నాయి. అమరుని ఆగ్రహం హద్దులు మీరింది.

'మోసం. ప్రత్యర్థులు తమ పౌరుష ప్రతాపాలు జూప దమ్ములు జాలక అర్థరాత్రివేళ ఆర్యావర్తనముపై బడుచున్నాడు అలెగ్జాండరు. అంబియే మార్గదర్శియై వుండగలడు. జాతిద్రోహము తలపెట్టిన అంబికి, ప్రపంచద్రోహం తలపెట్టిన అలెగ్జాండరునకు బుద్ధిగరపాలి

'వీరులారా! భారతీయుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరింప వస్తున్నాడు అలెగ్జాండరు భారతావనిలో యీ నరహంతకుని మొదటిసారిగా నెదిరించిన ఘనత మనకే దక్కుతుంది. మీ దేశభక్తి, ప్రభుభక్తి చూపే సమయ మాసన్నమైంది. పదివేల సేనలు పదివేల కోట్లలాగా విజృంభించండి. భారతీయుల పౌరుష ప్రతాపాలు గ్రీకులు నేడు చవిజూతురు గాక!'

గర్జిస్తూ, సింహకిశోరము శత్రువులపై లంఘించింది.

పోరు ఘోరమైంది. కోదమ సింగంలా, కదనరంగమంతా కల్లోల పరుస్తున్న అమరుని జూచి, అచ్చెరువొందాయి గ్రీకుదళాలు. కాలవీరుని ఎదిరించాడు తక్షశిలాధీశుడు అంబి. అమరుని కళ్ళు అగ్నిని వర్షించాయి. అసహ్యించుకొన్నాడు అంబిని జూచి.

'ఛీ! మాతృదేశద్రోహీ! పరదేశీయుల పాదరక్షలు మోయు పాపివి, నీవూ ఒక వీరుడవేనా? తగుదునమ్మా అంటూ కదనరంగంలో కనుబట్టావు. కాచుకో యీ ఖడ్గఘాతాన్ని'

అంబి ఆయుర్దాయము ఆ నాటితో ఆఖరు కావలసింది. అమరుడు విసరిన ఖడ్గం వెంట్రుకవాసిలో తప్పింది. కాని అంబి ఎక్కిన పంచకల్యాణి పంచత్వమొందింది. అమరుని సమర కౌశల్యానికి గాలిలో కలసి పోతున్నాడు అంబి. చావుతప్పి, కన్ను లొట్టపోయినట్లై, పిక్కబలంజూప తప్పిందిగాదు అంబికి.

వీరులను గౌరవించేవాడు అలెగ్జాండరు. పదునారేండ్లు నిండీ నిండని, రాచబిడ్డ ప్రదర్శించే ధైర్యసాహసాలకు విస్మయం జెందాడు.

కుమారుని యుద్ధ కుశలతనుగాంచి, పులకాంకితుడైనాడు, అమరుని సమీపించాడు.

'ఓహో ! గ్రీకుసార్వభౌములా ! ప్రపంచ విజేతలు గాబోలు ! మీ గోరీలు భారతావనిలోనే కట్టిస్తాం యుద్ధానికి సిద్ధంగా వున్నారా ! గర్జించింది భారత సింహ కిశోరం.

'రా కుమారా ! నీ అకుంఠిత పరాక్రమానికి మా హృదయ మానందించింది సూర్యోదయమయ్యేవరకు సంగ్రామం నిలిపివేస్తాం సర్వ సైన్య సమేతుడవై నీవు మరల మమ్ము మార్కొనవచ్చును. ఈ నీ స్వల్ప సేనతో మా మహా సేనావాహినిని ఢీకొనజాలవు' హితబోధ చేశాడు అలెగ్జాండరు

'గ్రీకునివాసీ ! నన్ను అంబియని తలచావా? వ్యర్థగర్జనలకే వణికిపోయి, వట్టి ప్రగల్భాలకే వొదిగిపోవుటకు భారతావనిని పాలించు రాజులు గాజులు తొడుగుకొనలేదు అంబి లాగ దురాక్రమణదారు లెంతటిఅజేయులైనా, రణరంగంలో రక్తరంజితం ఖడ్గరాజాలతో సమాధాన మిస్తారుగాని, పరదేశీయుల పాదాక్రాంతు లెన్నటికీ కారు. మీ యదృష్టము నిప్పుడే నిర్ణయించుకోండి' లంఘించాడు శత్రువుపైకి అమరుడు గ్రీకు సర్వసేనాని సెల్యూకస్ అడ్డురావడంతో తప్పుకొన్నాడు అలెగ్జాండరు

అంబి ప్రోత్సాహంతో గ్రీకు సైనికు లందరు ఒక్కుమ్మడి అక్రమంగా అమరునిపైకి విరుచుకపడ్డారు. ఈ అక్రమాన్ని అరికట్టేందుకు యుద్ధం తక్షణం నిలుపవలసిందిగా శంఖం పూరించాడు, అలెగ్జాండరు. కాని అంబి వాంఛ సఫలీకృతమైంది. అరుణోదయ కాంతులలో రక్తారుణమైన అమరుని దేహం, పూచిన మోదుగై పుడమిపై వాలింది.

అమరుడు అమరుడైనాడు.

♦ ♦ ♦

★ కెరటాలు ★

రంగబాబు అన్నివిధాలా అదృష్టవంతుడు అతని జీవితాన్ని మహాకవి వాక్కులో వుటంకించాలంటే 'వడ్డించిన విస్తరి' అతను నాలుగైదు లక్షల ఆస్తికధికారి అందమైన భార్యను పొందేడు. పండువంటి పుత్రుడ్ని కన్నాడు. నలుగురికి పెట్టి తను తినగలిగిన స్థితి అతనిది. కాని, తనకులేని అతి చిన్న స్వల్పమైన ఆనందాన్ని అతని స్నేహితునిలో గమనించాడు రంగబాబు అంతే! అతని మనస్సాగరంలో తుఫాను ఆరంభమైంది. అసహనం, ఆవేదన అతన్ని ఆవేశించాయి. అందుకనే, ఏమీలేనివారు తమ బ్రతుకుల్ని హాయిగా వెళ్ళబుచ్చుకోగలరు గాని, అన్నీ వున్నవారు మరి కొన్నిటికోసం తపించిపోవటం సహజమై పోయింది.

♦ ♦ ♦ ♦

రమ ఉత్తరం చదివేసరికి నిలువునా నీరైపోయేను తన జీవితం నడిసముద్రంలో నావలా వుందనీ, ఆదుకొనే సహాయులు కావాలనీ వ్రాసింది ఆమె ఏవైపు చూసినా చీకటికోణాలు దృగ్గోచరమౌతున్నాయట. ఆర్థికబాధ అయితే తీర్చగలను కాని సంసారపు చిక్కులు విప్పటానికి నేనేం చేయగలను? కాని, ఆప్తులు ఆత్మీయులు ఆపదలో వున్నారంటే ఆదుకోవాలని మనస్సు తహతహ లాడుతుంది ఏం చేయాలో, ఏం చేయగూడదో అనే ఆలోచనలు చుట్టుముట్టినై. తీరా ఒక నిర్ణయానికి వచ్చి వెళ్లేసరికి అంతా జరిగిపోయింది. నీతిశతకంలో చెప్పినట్లు మనసు విరిగితే అతకటం కష్టంగదా !

♦ ♦ ♦ ♦

శర్మగారు జీవితం తనకేది అందిస్తే దాన్ని స్వీకరించటం నేర్చుకున్నాడు. ఇంట్లో తిండిలేక బజార్లో తిరుగుతుంటే, సైన్యంలో చేరమని ఎవరో దారినపోయే దానయ్య చెప్తే ఆ పని చేసేడు. రెండవ ప్రపంచయుద్ధంలో ఇటలీ పంపితే వెళ్ళొచ్చేడు తిరిగి రాగానే అనారోగ్య కారణాల దృష్ట్యా నిన్నింటికి పంపుతున్నామంటే 'అలాగే' అన్నాడు మందులకోసం హాస్పటల్‌కి తిరుగుతూ వున్న రోజుల్లో డాక్టర్ మాల 'నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళిచేసుకుంటా'నంటే సరే అన్నాడు. ఏదో కంపెనీలో మేనేజరయ్యాడు.